
సాక్షి ఖమ్మం

సోమవారం । 24 । మార్చి । 2025



పెరిగిన విద్యుత్ వినియోగం

అధిక ఉష్ణోగ్రతతో గృహ వినియోగం పెరగగా, పంటలకు సాగు నీరందించేందుకు వ్యవసాయ విద్యుత్ వాడకం సైతం భారీగా పెరిగింది. 8లో



గరిష్టం / కనిష్టం
38° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళ వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

జాతీయ ఉషా టోర్నీకి నలుగురి ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ : జాతీయస్థాయి సీనియర్ ఉషా టోర్నీకి జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. బిలాస్‌పూర్‌లో జరుగనున్న ఫెడరేషన్ కప్ పోటీల్లో వీరి రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నారు. ఎంపికైన వారిలో పి.పవిత్రాచారి, పి.సత్యజిత్‌చారి, బి.హర్షవర్ధన్, ఎస్. ఉదయ్‌కిరణ్ ఉన్నారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి హర్షం వ్యక్తం చేశారు.

టీడీసీఏ క్రికెట్ జట్టుకు..



ఎంపికైన క్రికెటర్లు వీరే..

తెలంగాణ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే టోర్నీకి జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఈనెల 24 నుంచి 31 వరకు జరుగనున్న ఈ టోర్నీలో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రికెటర్లు పాల్గొనున్నారు. ఎంపికై న వారిలో గోవర్ధన్, సాయి సాకేత్, ప్రియాంష్‌రెడ్డి, చందు ఉన్నారు. ఎంపికై న వారిని సీపీ సునీల్‌దత్, డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, టీడీసీఏ కోఆర్డినేటర్ ఎం.డి.మతిన్, కోచ్ సంపత్, నిరంజన్, నాగేశ్వరరావు, ఇమ్రాన్, శ్రీనివాస్, రాంబాబు అభినందించారు.

కాలినడకన ద్వారకా తిరుమలకు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన 16 మంది ఆదివారం స్థానిక శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నుంచి కాలినడకన ద్వారకా తిరుమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంతరాలు రాకుండా చూడాలని స్వామివారిని వేడుకున్నారు. పాదయాత్రగా వెళ్లినవారిలో మధుబాబు యూత్ సభ్యులు కోలగట్ల చెన్నకేశ్వరరావు, ముత్తా అబ్బులురావు, తిరుమలశెట్టి సాయి, వనపర్తి మోహన్‌రావు, మలిశెట్టి రాంబాబు, పాకిన వెంకటకృష్ణ, చిన్న వెంకటేశ్వరరావు, అరిగే భీమాచారి, జల్లిపల్లి వాసుదేవరావు తదితరులు ఉన్నారు.

భువనగిరికి బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు



ఎన్నికలకు హాజరైన జిల్లా ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య(టీబీఎస్ఎస్ఎస్) నూతన కమిటీ ఎన్నిక ఆదివారం యాదాద్రి జిల్లా భువనగిరి సమీపంలో గల స్వర్ణగిరి ఆలయంలో జరగగా, జిల్లా సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికల కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సురావజ్జల వాసుశర్మ, యువజన అధ్యక్షుడు సరస్వతిభట్ల శ్రీధర్ శర్మ, రాష్ట్ర రీజనల్ కో–ఆర్డినేటర్ తాటికొండాల సీతారామశాస్త్రి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆమంచి సురేష్ శర్మ, ప్రతినిధులు జిలుగుల సతీష్ శర్మ, సన్నిధానం జగన్నాధం, రమామనోహర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.

రేషన్‌కార్డు ఉన్న లబ్ధిదారులకు ఇక సన్న బియ్యం అందనున్నాయి. ఉగాది సందర్భంగా ప్రారంభించి.. వచ్చే నెల 1 నుంచి పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని 748 దుకాణాల్లో 4,11,428 రేషన్ కార్డులకు ఈ బియ్యం పంపిణీ చేస్తారు. ఈ కార్డులకు సంబంధించి 11,21,049 మంది లబ్ధిదారులు ఉండగా నెలకు 7,230.750 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. ఈ ఏడాది ప్రారంభం నుంచే సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. అయితే సన్న ధాన్యం నిల్వలు ప్రభుత్వం వద్ద లేకపోవడంతో ఈ ఉగాది నుంచి పంపిణీ చేస్తున్నారు. గత వానాకాలం సీజన్‌లో పౌరసరఫరాల సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సన్న ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం.. ఈ ధాన్యాన్ని మిల్లులకు ఇచ్చి మర ఆడించింది. ఆ బియాన్ని ఎక్కడికక్కడ గోదాముల్లో నిల్వ చేసి వచ్చే నెల 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నారు.

– సాక్షిప్రతినిధి,ఖమ్మం

సమయం ఆసన్నం

వచ్చేనెల 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ

- జిల్లాలో 4,11,428 రేషన్‌కార్డులు.. 11.21 లక్షల మంది లబ్ధిదారులు
- గోదాముల్లో 85,735.446 మెట్రిక్ టన్నుల బియ్యం సిద్ధం
- జిల్లాలో ఏడాదికి సరిపడా నిల్వలు



సన్నధాన్యం సాగుపై దృష్టి..

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో సన్న ధాన్యం సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగానే ప్రణాళిక రూపొందించింది. సన్న రకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించింది. దీంతో రైతులు ఎక్కువగా ఈ ధాన్యం సాగువైపే మొగ్గు చూపారు. జిల్లాలో మొత్తం 2,81,991 ఎకరాల్లో వరి సాగు చేయగా.. అందులో 2,62,230 ఎకరాల్లో సన్న రకం ధాన్యమే పండించారు. 19,761 ఎకరాల్లో దొడ్డు రకాలు సాగయ్యాయి. పౌర సరఫరాల సంస్థ 344 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 47,494 మంది రైతుల నుంచి సన్న ధాన్యాన్ని సేకరించింది. దొడ్డు వడ్లను కూడా కొనుగోలు చేసిన అధికారులు.. ఈ రెండు రకాలను వేర్వేరుగా నిల్వ చేశారు. సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం మిల్లర్లకు అందజేశారు.

మిల్లింగ్‌కు 2.81 లక్షల మెట్రిక్ టన్నులు..

జిల్లాలో 2,81,440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం మిల్లర్లకు అందించింది. ఈ ధాన్యానికి సంబంధించి 1,88,574.680 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. కాగా రేషన్ దుకాణాలకు అందించే సన్న బియ్యానికి సంబంధించి 2,52,563 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు చేరింది. వారి నుంచి సీఎంఆర్ కింద 1,69,217.21 మెట్రిక్ టన్నుల బియ్యం చేరాల్సి ఉండగా ఇప్పటి వరకు 85,735.446 మెట్రిక్ టన్నుల బియ్యం పౌర సరఫరాల సంస్థకు చేరాయి. ఇంకా 83,481.764 మెట్రిక్ టన్నుల ధాన్యం రావాల్సి ఉంది. వచ్చిన సన్న బియ్యాన్ని జిల్లాలోని తొమ్మిది గోదాముల్లో నిల్వ చేశారు.

ఈ ఏడాది ఢోకా లేనట్టే..

రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ఈ ఏడాది సన్న బియ్యం పుష్కలంగా అందుబాటులో ఉండనున్నాయి. జిల్లాలో 4,11,428 కార్డులు ఉండగా.. 11,21,049 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి నెలకు మొత్తం 7,230.750 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం అవసరం.

ఏడాదికి మొత్తం 86,769 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతాయి. అయితే ఇప్పటి వరకు సీఎంఆర్ కింద 85,735.446 మెట్రిక్ టన్నుల బియ్యం పౌర సరఫరాల సంస్థకు చేరగా, గోదాముల్లో నిల్వ చేశారు. అక్కడి నుంచి ప్రతినెలా మండల స్టాక్ పాయింట్లకు చేరుతాయి.

ఇప్పటికే ఏడాదికి సరపడా సన్న బియ్యం స్టాక్ ఉన్నాయి. మిల్లర్ల నుంచి ఇంకా 83,481.764 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ఈ మొత్తం కూడా పౌరసరఫరాల సంస్థకు చేరితే.. ఏడాదికి సరిపడా రేషన్ దుకాణాలకు అందుబాటులో ఉంటాయి.

ఉగాదికి ముహూర్తం..

ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతున్న సన్న బియ్యం ఉగాది నుంచి లబ్ధిదారులకు అందనున్నాయి. గత కొన్ని నెలలుగా బియ్యం కొరతతో లబ్ధిదారులకు దొడ్డు బియ్యం కూడా అందడం లేదు. జిల్లాలో బియ్యం కొరతతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గత రెండు నెలలుగా ఇతర జిల్లాల్లో కూడా బియ్యానికి కటకట ఏర్పడగా వారు కూడా ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో జిల్లాకు బియ్యం రావడం కొంత ఆలస్యమైంది. ఈనెల కూడా బియ్యం దొరక్కపోవడంతో రైతుల నుంచి సేకరించిన దొడ్డు బియ్యాన్ని మర ఆడించి లబ్ధిదారులకు అందించారు. అయితే ప్రస్తుతం సీఎంఆర్‌కు ఇచ్చిన సన్న బియ్యం పౌర సరఫరాల సంస్థకు చేరింది.

బియ్యం వివరాలిలా..(మెట్రిక్ టన్నుల్లో)

సీఎంఆర్ కోసం మిల్లర్లకు ఇచ్చిన సన్న ధాన్యం	2,81,440
మిల్లర్ల నుంచి రావాల్సిన సన్న బియ్యం	1,88,574.680
ఇప్పటి వరకు పౌరసరఫరాల సంస్థకు చేరిన బియ్యం	98,394.955
ఇంకా చేరాల్సింది	90,179.725
రేషన్ దుకాణాల కోసం మిల్లర్లకు అప్పగించిన ధాన్యం	2,52,563
మిల్లర్ల నుంచి రావాల్సిన సన్న బియ్యం	1,69,217.21
ఇప్పటి వరకు పౌరసరఫరాల సంస్థకు చేరింది	85,735.446
ఇంకా రావాల్సింది	83,481.764

వర్షాకాలంలోగా పనులు పూర్తి చేయాలి

అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



గుర్రాలపాడులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న పొంగులేటి

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులు వర్షాకాలం లోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడులో రూ.2.50 కోట్లు, వెంకటగిరిలో రూ.2.40 కోట్లు, గుదిమళ్లలో రూ.1.95 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల అవసరాల మేరకు ఇంకా ఏమైనా రోడ్లు నిర్మించాల్సి ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం గుదిమళ్లలోని తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఆర్‌డీఓ నర్సింహారావు, పంచాయతీరాజ్ ఈఈ వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎ. శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- సీపీ సునీల్‌దత్
- వేపకుంట్లలో పోలీసులు – వైద్యుల ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు ప్రారంభం



బౌలింగ్ చేస్తున్న సీపీ సునీల్‌దత్

రఘునాథపాలెం: నిత్యం విధినిర్వహణలో పని ఒత్తిడితో సతమతమయ్యే వారికి మానసిక ప్రశాంతత కోసం క్రీడలు దోహదపడతాయని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో పోలీసులు–వైద్యుల ఒకరోజు ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. పోలీస్ జట్టు తరఫున బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. డీసీపీలు నరేష్(అడ్మిన్) ప్రసాదరావు(లాఅండ్‌ఆర్డర్), ఏఆర్ సీఐ సుశీల్‌కుమార్, ఆర్‌ఐ కామరాజు, సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణికుమార్, ఎస్‌బీ ఏసీపీ సాంబరాజు, సీఐలు ఉస్మాన్ షరీఫ్, రాజారెడ్డి, భానుప్రకాశ్, శ్రీహరి, రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్సై సాగర్, ప్రవీణ్‌కుమార్, వైద్యులు అసాధారణ్, కూరపాటి ప్రదీప్, అనిల్, సురేశ్, రవి, సుమంత్ తదితరులు పోటీల్లో పాల్గొన్నారు. కాగా, డాక్టర్ల టీం కప్ గెలుచుకుంది. కార్యక్రమంలో కోచ్ రాజశేఖర్, పొట్టపల్లి రాజా, మాజీ సర్పంచ్ ధారా శ్యాం పాల్గొన్నారు

నిలిచిన ఆర్టీసీ బస్ రిజర్వేషన్లు

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌తో సేవలకు బ్రేక్

ఆర్టీసీ డిపో	రిజర్వేషన్ బస్సులు	ఆర్టీసీ డిపో	రిజర్వేషన్ బస్సులు
ఖమ్మం	43	కొత్తగూడెం	08
మధిర	07	భద్రాచలం	31
సత్తుపల్లి	22	మణుగూరు	22

సత్తుపల్లిటౌన్: దూర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సులకు రిజర్వేషన్ చేయించుకోవాలనుకుంటే నిరాశే ఎదురైంది. రిజర్వేషన్ వెబ్‌సైట్‌ను 'చలో యాప్'లోకి అప్‌డేట్ చేసే ప్రక్రియ కొనసాగుతుండగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, సత్తుపల్లి డిపోల నుంచి నిత్యం 133 సర్వీసులకు ఈ రిజర్వేషన్ సదుపాయం ఉంది. ప్రధానంగా హైదరాబాద్, విశాఖపట్టణం వెళ్లే ప్రయాణికులు రిజర్వేషన్ చేయించుకుంటారు. వీకెండ్‌కు వచ్చిన ఉద్యోగులు, కళాశాలల విద్యార్థులు ఆదివారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లేందుకు రిజర్వేషన్ కోసం రాగా సేవలు లేకపోవడంతో నిరాశకు లోనయ్యారు. ఈ విషయమై ఆర్‌ఎం సరిరాంను 'సాక్షి' వివరణగా కోరగా రిజర్వేషన్ సేవల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రేపు కేఎంసీ బడ్జెట్ సమావేశం

2025–26 సంవత్సరానికి రూ.102.71 కోట్ల ఆదాయం అంచనా



ఖమ్మంమయూరిసెంటర్ : ఖమ్మం నగరం విస్తరిస్తుండడంతో అభివృద్ధి, ఆదాయం పెరుగుతోంది. కేఎంసీకి వచ్చే ఆదాయం, అయ్యే ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. రాబోయే 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి కార్పొరేషన్ అధికారులు రూపొందించిన అంచనా బడ్జెట్ ఈ విషయాన్ని తెలియజేస్తోంది. 2023 – 24లో రూ.67.08 కోట్లు ఉన్న బడ్జెట్ 2024 – 25లో రూ.80.67 కోట్లుగా అంచనా వేశారు. అయితే ఆ ఏడాదికి సంబంధించి రివైజ్డ్ బడ్జెట్ రూ.90.82 కోట్లుగా చూపిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సర ఆదాయం, ఖర్చులను లెక్కలు కట్టి 2025 – 26 ఆర్థిక సంవత్సర అంచనా బడ్జెట్‌ను రూ.102.82 కోట్లుగా రూపొందించారు. మంగళవారం జరిగే కేఎంసీ కౌన్సిల్ సమావేశంలో దీన్ని ప్రతిపాదించనున్నారు.

ఆదాయం ఇలా..

2025–26 ఆర్థిక సంవత్సరంలో కేఎంసీకి వచ్చే ఆదాయ వివరాలపై ఓ అంచనా వేశారు. ఆస్తి పన్నుల ద్వారా రూ.33.92 కోట్లు, స్టాంప్ డ్యూటీ ద్వారా రూ.13 కోట్లు, కేఎంసీ భవనాల అద్దెల ద్వారా రూ.4.43 కోట్లు, ప్రజారోగ్యం/పారిశుద్ధ్యం ద్వారా రూ.3.61 కోట్లు, టౌన్ ప్లానింగ్ ద్వారా రూ.36.10 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.11.76 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఇక డిపాజిట్లు, అడ్వాన్సులు, రుణాల ద్వారా మరో రూ.6.76 కోట్లు ఆదాయం వస్తుందని లెక్కలు వేశారు.

ఖర్చులు ఇలా..

రాబోయే ఆర్థిక సంవత్సరంలో కేఎంసీ ఖర్చులపైనా అధికారులు అంచనాలు వేశారు. ప్రధానంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలకు రూ.30.70 కోట్లు, పారిశుద్ధ్యానికి రూ.11.16 కోట్లు, విద్యుత్ చార్జీలు రూ.10.90 కోట్లు, రుణాల చెల్లింపు రూ.2.01 కోట్లు, గ్రీన్ బడ్జెట్ రూ.10.28 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం నిర్వహణకు రూ.7.77 కోట్లు, సాధారణ పరిపాలన వ్యయం రూ.5.83 కోట్లు, టౌన్‌ప్లానింగ్ విభాగం వ్యయం రూ.52 లక్షలు, విలీన గ్రామాలకు రూ.7.88 కోట్ల కేటాయింపు, పబ్లిక్ ఎమిటేషన్ వ్యయం రూ.79 లక్షలు, వార్డు బడ్జెట్ రూ.14.97 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సులు, రుణాలు రూ.6.76 కోట్లుగా లెక్కలు వేశారు.

కార్పొరేటర్లకు బడ్జెట్ కాపీలు..

ఈనెల 25న ఖమ్మం నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో ఇప్పటికే బడ్జెట్ అంచనాను రూపొందించిన అధికారులు సంబంధిత కాపీలను కార్పొరేటర్లకు అందజేశారు. ఈనెల 25న కార్పొరేటర్లు బడ్జెట్ సమావేశాలకు రావాలని ఆహ్వాన పత్రం అందించడంతో పాటు బడ్జెట్ కాపీని అందజేశారు. అధికారులు రూపొందించిన బడ్జెట్‌పై కార్పొరేటర్లు ముందుగానే అవగాహన పొందేందుకు ఈ కాపీలను అందించినట్లు తెలిసింది.

విద్యుత్ స్పాట్ బిల్లింగ్ రేట్లు పెంపు

ఏప్రిల్ 1 నుంచి అమలు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ స్పాట్ బిల్లింగ్ ఏజెన్సీల వేతన రేట్లను పెంచుతూ టీజీ ఎన్పీడీసీఎల్ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. స్పాట్ బిల్లింగ్ రేట్లపై పలు కార్మిక సంఘాల అభ్యర్థన మేరకు అధ్యయనం చేసి సమగ్ర నివేదిక అందించాలని సంస్థ నలుగురితో కూడిన కమిటీని ఏర్పాటు చేయగా.. గత నెల 24న నివేదిక సమర్పించింది. అర్బన్, రూరల్ ప్రాంతాలకు వేర్వేరుగా ధరలు పెంచుతూ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అర్బన్ ప్రాంతాల్లో ఒక్కో మీటర్ స్పాట్ బిల్లింగ్ ధర ప్రస్తుతం ఏజెన్సీలకు రూ. 5.10 ఉండగా దాన్ని రూ. 6.54కు, రూరల్‌లో రూ. 5.73 ఉండగా రూ. 7.31కి పెంచారు. ఇక మీటర్ రీడర్లకు అర్బన్‌లో ప్రస్తుతం రూ. 2.51 కాగా ఆ ధరను రూ. 3.60కి, రూరల్‌లో రూ. 2.84 నుంచి రూ. 4.07కు పెంచారు. పెరిగిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తామని సీఎండీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఈ పెంపు సమంజసంగా లేదని, తమకు కనీస వేతనం ఇస్తూ ఆర్టిజన్లుగా గుర్తించాలని మీటర్ రీడర్లు కోరుతున్నారు.



పర్యావరణ పరిరక్షణకు..

- విద్యార్థుల్లో అవగాహన పెంచేలా విస్తృత కార్యక్రమాలు
- యూత్ అండ్ ఎకో క్లబ్‌ల ఏర్పాటు
- పీఎస్‌లకు రూ.3వేలు, హైస్కూళ్లకు రూ.5వేలు విడుదల



తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు హైస్కూల్ కిచెన్ గార్డెన్‌లో కూరగాయలు కోస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే వివిధ కార్యక్రమాలు కొనసాగుతుండగా.. ఇటీవల పాఠశాల స్థాయిలో 'యూత్ అండ్ ఎకో క్లబ్' పేరుతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లాలో 1,148 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా సుమారు 84 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల స్థాయిలో పర్యావరణ హిత కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థులను చైతన్యవంతులను చేసేందుకు ఒక్కో హైస్కూల్‌కు రూ.5వేలు, ప్రాథమిక పాఠశాలలకు రూ.3 వేల చొప్పున మొత్తం 42.36 లక్షల నిధులను ఇటీవల ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

నిధుల వినియోగం ఇలా..

పాఠశాలలకు విడుదల చేసిన నిధులతో కిచెన్ గార్డెన్ల సంరక్షణ, వినాయక చవితి సందర్భంగా మట్టి ప్రతిమల తయారీ, ఓజోన్ డే, ఎర్త్ డే, వాటర్ డే తదితర కార్యక్రమాలు చేపట్టాలి. ఆయా అంశాలపై కాంప్లెక్స్ స్థాయిలో పోటీలు నిర్వహించాలి. అలాగే పెద్ద ప్లాస్టిక్ టబ్బులు(40లీటర్లు) 2, మల్టీ పర్పస్ ప్లాస్టిక్ ట్రేలు 2, అలంకరణ మొక్కలు పెంచేందుకు 8 రౌండ్ ప్లాస్టిక్ తొట్లు, విత్తనాలు మొలకెత్తేందుకు ఒక ట్రే కొనుగోలు చేయాలి.

పీడీలకు పూర్తయిన శిక్షణ

యూత్ అండ్ ఎకో క్లబ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాకు చెందిన 20 మంది ఫిజికల్ డైరెక్టర్లు(పీడీ)లకు ఇటీవల హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు.

వారంతా ఆయా పాఠశాలల్లో పర్యావరణ హితమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కిచెన్ గార్డెన్ల పెంపకం, విద్యార్థులకు మొక్కలపై ఆసక్తి పెంచేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలోని పాఠశాలలకు విడుదలైన నిధులు.. (రూ.లలో)

	మొత్తం స్కూళ్లు	ఒక్కో పాఠశాలకు విడుదలైన నిధులు	మొత్తం
ప్రాథమిక పాఠశాలలు	752	3,000	22,56,000
ప్రాథమికోన్నత పాఠశాలలు	187	5,000	9,35,000
హైస్కూళ్లు	194	5,000	9,70,000
కేజీబీవీలు	14	5,000	70,000
అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్	01	5,000	5000

పర్యావరణంపై అవగాహన కలిగేలా



రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో యూత్ అండ్ ఎకో క్లబ్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీని ద్వారా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలుగుతుంది. అలాగే విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు కూడా అందిస్తోంది. ఇప్పటికే పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు నిర్వహిస్తున్న క్రమంలో మరింత ఉపయోగం కలుగనుంది.

– ఈ.సోమశేఖర శర్మ, డీఈఓ.

ఇటు ముంజ.. అటు కూజా!



వేసవి కాలం వచ్చేసింది. ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయమే తన ప్రభావం మొదలుపెడుతున్న భానుడు మధ్యాహ్నానికి నడినెత్తికి చేరుతున్నాడు. ఈ నేపథ్యాన వేసవిలో మాత్రమే లభించే తాటి ముంజల అమ్మకం జోరందుకుంది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న వారు వీటిని డజన్ రూ.100 చొప్పున పలు కూడళ్లలో అమ్ముతుండగా స్థానికులు కొనుగోలు చేస్తున్నారు. ఇదే సమయాన చల్లని నీటి కోసం ఫ్రిజ్‌లు ఉన్నా కొందరు కూజాలు కొనుగోలు చేస్తుండడం విశేషం. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

అమెరికా యూనివర్సిటీలో సీటు


సాయివరుణ్

సత్తుపల్లిటౌన్: పట్టణానికి చెందిన సునీత జ్యూయలరీ యజమాని బేతిన్ని శేష గిరిరావు, సునీత దంపతుల కుమారుడు డాక్టర్ సాయివరుణ్‌కు అమెరికాలోని ప్రతిష్టాత్మక వెస్ట్ వర్జీనియా యూనివర్సిటీలో ఎండీ న్యూరాలజీ విభాగంలో సీటు లభించింది. 60 వేల డాలర్ల వార్షిక స్కాలర్‌షిప్‌తో ఈ అరుదైన సీటు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

పీస్‌రేట్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ పీస్‌రేట్ కార్మికులకు కనీస వేతనం చెల్లించడంతో పాటు ఆర్టిజన్లుగా గుర్తించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. ప్రసాద్ డిమాండ్ చేశారు. పీసురేటు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీటరు రీడర్లు, బిల్ కలెక్టర్లు, స్టోర్ హమాలీలు వంటి కార్మికులకు కనీస వేతనం అమలు కావడం లేదన్నారు. ఏళ్ల తరబడి సంస్థలో పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సంస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు వి. వీరయ్య, పుల్లయ్య, అనిల్‌కుమార్, నరేష్ కుమార్, యాదగిరి, రవికుమార్, ప్రదీప్, సుదాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నారా..

సులభంగా స్టేటస్ తెలుసుకోవచ్చు


ఎఫ్ఎస్‌సీ సెర్చ్ వెబ్ పేజీ

ఖమ్మం సహకారనగర్ : అనేక ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న ఎంతో మంది తమ దరఖాస్తుల స్టేటస్ తెలుసుకునేందుకు ఆతృత పడుతుంటారు. ఈ క్రమంలో దరఖాస్తుదారులు వివిధ కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. ఇలాంటి వారి ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఎస్‌సీ అప్లికేషన్ సెర్చ్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలుత క్రోమ్ బ్రౌజర్‌లోకి వెళ్లి ఎఫ్ఎస్‌సీ అప్లికేషన్ సెర్చ్ అని టైప్ చేయాలి. ఆ తర్వాత జిల్లా, మీ సేవ అప్లికేషన్ నంబర్, అప్లికేషన్ నంబర్, సెర్చ్ అనే ఆప్షన్లు ఉంటాయి. ఈ క్రమంలో తొలుత జిల్లాను ఎంపిక చేసి ఆ తర్వాత మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వారు మీ సేవ అప్లికేషన్ అని టైప్ చేసి సెర్చ్ అని టైప్ చేస్తే ఆ దరఖాస్తు వివరాలు అప్రూవల్ అయిందా... పెండింగ్‌లో ఉందా అనేది తెలుస్తుంది. జిల్లాను సెలెక్ట్ చేసి ప్రజాపాలనలో అప్లికేషన్ పెట్టుకున్న వారుంటే జిల్లా, ఆ అప్లికేషన్ నంబర్ వేసి సెర్చ్ అని టైప్ చేసి ఆ దరఖాస్తు వివరాలు సైతం నేరుగా తెలుసుకోవచ్చు. ఈ అప్లికేషన్ ద్వారా దరఖాస్తుదారుడి సమయం ఆదా అవడంతో దరఖాస్తు ఎక్కడుందనే వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు.

సెల్ టవర్ వద్ద అగ్నిప్రమాదం


నాగినేనిప్రోలు సెల్ టవర్ వద్ద చెలరేగుతున్న మంటలు

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని సెల్ టవర్ వద్ద ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సెల్ టవర్ పక్కన ఉన్న పంటచేలలోని వ్యర్థాలను కాలుస్తున్న క్రమంలో మంటలు టవర్ వరకు వ్యాపించాయి. మంటలు అంటుకుని టవర్ ఫైబర్ కేబుల్స్ కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో వచ్చిన భద్రాచలం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా కేబుల్స్ కాలిపోవటంతో సిగ్నల్స్‌కు స్వల్ప అంతరాయం ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
పెసలు	5,875	3,500
కందులు	6,500	6,000
వేరుశనగ	6,350	6,350
ఏసీ మిర్చి	14,200	9,500
తాలు మిర్చి	6,000	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,871

పెరిగిన విద్యుత్ వినియోగం

- నిత్యం 2 మిలియన్ యూనిట్ల మేర అదనంగా వాడకం
- అధిక ఉష్ణోగ్రతలు, యాసంగి పంటల సాగే కారణం



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగింది. అధిక ఉష్ణోగ్రతలతో గృహ వినియోగం బాగా పెరగడమే దీనికి ప్రధాన కారణం. దీనికి తోడు ఈ ఏడాది కురిసిన వర్షాలతో జలాశయాలు, భూగర్భంలో నీరు సమృద్ధిగా ఉండడంతో జిల్లా వ్యాప్తంగా యాసంగి పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. మరోవైపు గ్రానైట్, ఇతర పరిశ్రమలు కూడా ఉండడంతో విద్యుత్ వినియోగం సాధారణానికి మించింది. జిల్లాలో ఉన్న విద్యుత్ కనెక్షన్లు, వినియోగం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని టీజీ ఎన్పీడీసీఎల్ జిల్లాకు నిత్యం 6.96 మిలియన్ యూనిట్ల విద్యుత్ కోటాను నిర్దేశించింది. ఫిబ్రవరి మూడో వారం వరకు జిల్లాలో దాదాపు కోటా మేరకు విద్యుత్ వినియోగం జరగగా నాలుగో వారం నుంచి ఇప్పటివరకు కేటాయించిన యూనిట్లకు మించి విద్యుత్ అవసరమవుతోంది.

నిత్యం 2 మిలియన్ యూనిట్ల వరకు అదనం..

ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలో మార్చి నెల ఆరంభం నుంచి నిత్యం సంస్థ నిర్దేశించిన కేటాయింపులకు మించి 2 మిలియన్ల విద్యుత్ విద్యుత్ వినియోగం జరుగుతోంది. జిల్లాకు రోజుకు విద్యుత్ కోటా 6.96 మిలియన్ యూనిట్లు కాగా, 8.70 నుంచి 9.09 మిలియన్ యూనిట్ల వరకు వినియోగిస్తున్నారు.

అధిక ఉష్ణోగ్రతలు, యాసంగి పంటలు..

మార్చి ఆరంభం నుంచి 35 – 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పలుచోట్ల 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఫ్యాన్లు, ఏసీల వాడకంతో ప్రధానంగా గృహ వినియోగం గణనీయంగా పెరిగింది. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు గృహ వినియోగం అధికంగా ఉంటుందని విద్యుత్‌శాఖ అంచనా వేసింది. పగటి వేళల్లో కూడా గృహ విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. దీనికి తోడు జిల్లాలో నీటి వనరుల ఆధారంగా యాసంగి పంటలను సాగు చేశారు. నాగార్జున సాగర్ ఆయకట్టు భూముల్లో వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. జిల్లా మొత్తంలో 2 లక్షల ఎకరాల్లో వరి, 1.30 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. సాగర్ కాల్వల నుంచి వానబందీ పద్ధతిలో నీరు విడుదల చేస్తుండగా రైతులు తమ భూముల్లో బోర్లు వేసుకొని భూగర్భ జలాలను కూడా వినియోగించుకుంటున్నారు. మార్చిలో పంటలు చివరి దశలో ఉండడంతో నీటి వినియోగం అధికంగా ఉంటుంది. దీంతో వ్యవసాయ విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. దీనికి తోడు జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల సంఖ్య కూడా పెరిగింది. ఈ ప్రభావం కూడా విద్యుత్ వినియోగం పెరగడానికి కారణమని చెప్పవచ్చు.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

గృహ కనెక్షన్లు	4,92,745
వ్యవసాయ కనెక్షన్లు	1,18,267
పరిశ్రమలు	65,822
ఇతరాలు	12,839
మొత్తం	6,89,673

మార్చిలో కోటాకు మించి 2 మిలియన్ యూనిట్లకు పైగా వినియోగించిన రోజులిలా..

తేదీ	అదనపు వినియోగం	తేదీ	అదనపు వినియోగం
		13న	2.16
		15న	2.09
మార్చి 2న	2.07	16న	2.22
4న	2.13	17న	2.04
7న	2.06	18న	2.10
9న	2.02	19న	2.05
12న	2.26	21న	2.03

తహసీల్దార్ పేరుతో బ్యాంక్ రుణానికి దరఖాస్తు

నకిలీ అధికారిగా గుర్తించిన బ్యాంకర్లు


బాలరాజు పేరుతో తయారు చేసిన నకిలీ గుర్తింపు కార్డు

కూసుమంచి: తన పేరు జంగం బాలరాజు అని, తాను కూసుమంచి తహసీల్దార్‌గా పనిచేస్తున్నానంటూ నకిలీ గుర్తింపు కార్డుతో బ్యాంకు లోన్‌కు దరఖాస్తు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జంగం బాలరాజు అనే పేరుతో ఓ వ్యక్తి హైదరాబాద్‌లోని జూబ్లిపుర ఎస్‌బీఐ బ్రాంచ్‌లో వ్యక్తిగత రుణం కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. అక్కడి అధికారులు నిర్ధారణ నిమిత్తం కూసుమంచి బ్యాంకుకు అతడి వివరాలు పంపించారు. దీంతో కూసుమంచి బ్యాంకు మేనేజర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆరా తీయగా ప్రస్తుతం కరుణశ్రీ తహసీల్దార్‌గా ఉన్నారని, గతంలో కూడా బాలరాజు పేరుతో ఎవరూ పని చేయలేదని తేలింది. దీంతో నకిలీ అధికారిగా గుర్తించి అక్కడి అధికారులకు సమాచారం అందించడంతో వారు విచారణ చేపట్టారు. కాగా బాలరాజు పేరుతో తహసీల్దార్‌గా నమ్మించేందుకు జిల్లా కలెక్టర్ జారీ చేసినట్లుగా కలెక్టర్ ముద్రలు, ఫోర్జరీ సంతకంతో నకిలీ గుర్తింపుకార్డు సృష్టించి లోన్ పొందేందుకు ప్రయత్నించాడు. గుర్తింపు కార్డులో తన తండ్రి పేరు చంద్రమౌళి అని, కూసుమంచిలో నివాసం ఉంటున్నట్లు ఇంటి నంబర్ 7–24 అని పేర్కొన్నాడు. ఏకంగా తహసీల్దార్ నంటూ బ్యాంకును బురిడీ కొట్టించేందుకు బాలరాజు ప్రయత్నించడంతో అధికారులు అప్రమత్తమై విచారణ చేపట్టారు.

పెళ్లి పేరుతో నమ్మించి గర్భవతిని చేశాడు

- బాలిక బంధువుల ఆరోపణ..
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్
- పోలీసులు జాప్యం చేస్తున్నారంటూ వాటర్ ట్యాంక్ ఎక్కిన బాలిక


రహదారిపై రాస్తారోకో చేస్తున్న బాలిక బంధువులు

వాటర్ ట్యాంక్ ఎక్కిన బాలిక

ఎర్రుపాలెం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మైనర్ బాలికను గర్భవతిని చేశాడని, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయాలని ఎర్రుపాలెం మండలం భీమవరం గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. బాలిక బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలోని దళిత కాలనీకి చెందిన బాలిక, అదే గ్రామానికి చెందిన ముల్లంగి జమలయ్య అనే యువకుడు రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. ప్రస్తుతం ఐదు నెలల గర్భవతి కాగా, ఖమ్మం, విజయవాడలోని ఆస్పత్రులకు తీసుకెళ్లి అబార్షన్‌కు ప్రయత్నించాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని వారు ఆరోపించారు. దీంతో ఈనెల 21న తాము ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోలేదని, 22వ తేదీన ఖమ్మంలో సీపీని కలిసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఆదివారం గ్రామస్తులతో కలిసి మళ్లీ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేశారు. ఆ తర్వాత మధిర – విజయవాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. అయినా పోలీసులు స్పందించకపోవడంతో బాలిక స్టేషన్ పక్కనే ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే ఆమె సోదరుడు ట్యాంక్ ఎక్కి నచ్చజెప్పినా బాలిక కిందకు దిగకపోవడంతో ఎస్‌ఐ పి.వెంకటేష్, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. దీంతో గ్రామస్తులు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు బాలికకు న్యాయం చేస్తామని, నిందితుడిపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చిన ఎస్‌ఐ ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ల సాయంతో బాలికను కిందకు తీసుకొచ్చారు. కాగా, స్టడీ సర్టిఫికెట్‌లో ఉన్న వయసు ప్రకారం ఆమె మైనర్ కాదని ఎస్‌ఐ చెబుతుండగా, ఆధార్ కార్డు, ఆస్పత్రి రికార్డులు తమ వద్ద ఉన్నాయని, వాటి ప్రకారం అమ్మాయి మైనరేనని బంధువులు అంటున్నారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని చెబుతున్నారు. కేసు నమోదు కాకుండా ఇద్దరు పోలీస్ ఉన్నతాధికారులు, మాజీ ప్రజాప్రతినిధి అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, తనయుడు మృతి

- బైక్‌ను ఢీ కొట్టిన గుర్తు తెలియని వాహనం
- మృతులు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వాసులు


అరిసెపల్లి సరస్వతి (ఫైల్)


అరిసెపల్లి కృష్ణ (ఫైల్)

దమ్మపేట: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన ఘటనలో తల్లి, తనయుడు మృత్యు ఒడిలోకి చేరుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గాంధీనగరం గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన అరిసెపల్లి కృష్ణ(45), తల్లి సరస్వతి(65)తో కలసి ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట మండలం నారంవారి గూడెం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో గాంధీనగర్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తల్లీ, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహలను పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో అశ్వారావుపేటకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

ఆశ్రమ హాస్టల్‌లో అగ్ని ప్రమాదం


దగ్ధమైన క్రీడా వస్తువులు, పరుపులు

ములకలపల్లి: మండల పరిధిలోని కమలాపురం ఆశ్రమ హాస్టల్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. మొదటి అంతస్తులోని ఓ గదిలో మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు సమాచారం. గదిలో ఉన్న పాత పరుపులు, క్రీడా వస్తువులు దగ్ధమయ్యాయి. స్థానికులతో సమాచారంతో కొత్తగూడెం నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఆదివారం కావడంతో విద్యార్థులందరూ హాస్టల్‌లోనే ఉన్నారు. అయితే ప్రమాద సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో స్టడీ అవర్స్‌లో ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. కాగా రూ. 30 వేల నష్టం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రమాదా ఘటనపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆరా తీశారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు ఐదు పతకాలు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు ఐదు పతకాలు వచ్చాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మహీధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 22న తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరుగుపందెంలో జర్పుల దీక్షిత్ బంగారు పతకం, మాలోతు సింధు రజత పతకం, డి.లోకేష్, బి.దుర్గ కాంస్య పతకాలు, జావెలిన్‌లో ఎం.కృష్ణవేణి కాంస్య పతకం సాధించారని వివరించారు. విజేతలను జిల్లా క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి, క్రీడా సంఘాల బాధ్యులు కె.సారంగపాణి, యుగంధర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణ, పి.నాగేందర్, మల్లికార్జున్, గిరిప్రసాద్, జి.కృష్ణ, జె. నాగరాజు, కోచ్‌లు అభినందించారు.

బావిలో విషం.. చేపలు మృతి

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం (బీల్యాతండా) గ్రామానికి చెందిన భూక్యా వీరు అనే రైతు తన వ్యవసాయ బావిలో గతేడాది క్రితం చేప పిల్లలు పోశాడు. ప్రస్తుతం అవి ఒక్కోటి సుమారు 2 కిలోల వరకు పెరిగాయి. మరో రెండు, మూడు రోజుల్లో చేపలు పట్టి విక్రయించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు బావిలో పురుగుల మందు కలపగా చేపలు మొత్తం ఆదివారం మృత్యువాత పడ్డాయని, దాదాపు రూ. లక్ష మేర నష్టపోయానని బాధితుడు వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

రోడ్డుపై యువకుల వీరంగం

నేలకొండపల్లి : కొందరు యువకులు రోజు రోజుకూ పెచ్చుమీరుతూ.. బస్తీమే సవాల్ అంటూ ఘర్షణలకు పాల్పడుతున్నారు. పరస్పర దాడులకు దిగుతూ ప్రజలను భయంభ్రాంతులకు గురి చేస్తున్నారు. నేలకొండపల్లిలో ఆదివారం పట్టపగలు నడి రోడ్డుపై వీరంగం సృష్టించారు. రెండు వర్గాలుగా విడిపోయి తొలుత ఘర్షణకు దిగారు. అసభ్యపదజాలాంతో దూషించుకుంటూ పరస్పరం దాడులకు దిగారు. ఇరువర్గాల వారు హల్‌చల్ చేస్తుండగా అక్కడున్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. దాదాపు అరగంట పాటు వీరంగం సృష్టించగా వీడియో వైరల్ అయింది. అయితే వారు ఎందుకు ఘర్షణకు దిగారనే వివరాలు తెలియలేదు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

దమ్మపేట: కుటుంబ సభ్యులు మందలించడంతో మద్యం మత్తులో ఓ యువకుడు శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని పార్కలగండి గ్రామానికి చెందిన కొండ్రు శివ(19) మద్యానికి బానిసగా మారడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంటి పైకప్పు ఊచకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తెల్లవారుజామున గమనించిన కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో కిందకు దింపి చూడగా, అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి సీతారాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.

గోదావరిలో దూకి ఆత్మహత్య

భద్రాచలంఅర్బన్: పట్టణంలో బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం సరిహద్దున ఉన్న ఎటపాక గ్రామానికి చెందిన అనిల్ అనే వ్యక్తి ఈ నెల 20న ఇంటి నుంచి నడుచుకుంటూ వచ్చి అదే రోజు రాత్రి బ్రిడ్జి మీద నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం నదిలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వగా, పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్పించారు. మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డు వివరాలతో కుటుంబీకులకు సమాచారం అందించారు. కాగా అనిల్ భార్య పదేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకోగా అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల మతిస్థిమితం కోల్పోయాడని, ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఇద్దరికి గాయాలయ్యాయి. మద్రిమెదలు గ్రామానికి చెందిన రఘునాథరావు, రామకళ దంపతులు కరకగూడెంలో పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో గణేష్ అనే వ్యక్తి మరో బైక్‌పై వస్తుండగా, భట్టుపల్లి గ్రామంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గణేష్, రామకళకు గాయాలయ్యాయి.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: కుటుంబ కలహాలతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మల్లారంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని మల్లారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్ కుమారుడు ఈసం విజయ్ గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్ పని చేస్తునానడు. ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబీకులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కళాకారులను ఆదుకోవాలి


ప్రశంసపత్రం అందజేస్తున్న పోతినేని సుదర్శన్

మధిర: కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం కోరారు. మధిర బంజారా కాలనీ శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ అధ్యక్షుడు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న ఏకపాత్రాభినయం, పౌరాణిక నాటికల సన్నివేశ పోటీల్లో వారు మాట్లాడారు. మధిర ప్రాంతానికి చెందిన పలువురు కళాకారులు జాతీయస్థాయిలో అవార్డులు సాధించి మధిరకు దేశ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు తెచ్చారని అన్నారు. అలాంటి కళాకారులను ఆదుకోవాలని, అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వాలని కోరారు. అనంతరం కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముందుగా బళ్లారి రాఘవ కళాపరిషత్ అధ్యక్షుడు బొబ్బిళ్లపాటి శ్రీకృష్ణ సాయి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు మల్లాది హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గాభవాని



మాట్లాడుతున్న దుర్గాభవాని

ఖమ్మం సహకారనగర్ : రాష్ట్రంలో ప్రభుత్వం విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని కోరారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పూర్వ ప్రాథమిక పాఠశాలల వల్ల బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆర్థిక సౌలభ్యం కలుగుతుందని, పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి రెండో వేతన సవరణ సంఘం రిపోర్టును తెప్పించి 2023 జూలై నుంచి నూతన పీఆర్సీ అమలు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వర రావు, నాయకులు వల్లకొండ రాంబాబు, జి.వి. నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ప్రమాద ఘటనపై విచారణ


ప్రమాదం జరిగిన లిఫ్ట్‌ను పరిశీలిస్తున్న సైదులు

ఖమ్మంవైద్యవిభాగం : నగరంలోని ప్రసూన ఆస్పత్రిలో లిఫ్ట్ ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఆదివారం విచారణ చేపట్టారు. ఆ ఆస్పత్రిలో ఆపరేషన్ అనంతరం సరోజని(62) అనే మహిళను ఆపరేషన్ థియేటర్ నుంచి లిఫ్ట్ ద్వారా తరలించే క్రమంలో స్ట్రెచర్ పైనే ప్రాణాలు విడిచిన విషయం విదితమే. ఈ ఘటనపై ప్రాథమిక విచారణ నిమిత్తం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు విచారణ నిర్వహించారు. ప్రమాదానికి గల కారణాలపై సిబ్బందితో ఆరా తీశారు. సాంకేతిక లోపంతో లిఫ్ట్ అదుపు తప్పి ప్రమాదానికి గురైనట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు డాక్టర్ సైదులు తెలిపారు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి నివేదించనున్నట్లు వివరించారు. ఆస్పత్రిలో లిఫ్ట్ స్థితిగతులు, కంపెనీ వివరాలు, ఎన్ని సంవత్సరాలుగా వాడుతున్నారు, ఇంతకు ముందు ఏవైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలపై నివేదిక సమర్పించాలని ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. పూర్తి నివేదిక వచ్చాక యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.